ప్రజాశక్తి
శనివారం 15 మార్చి 2025 5 అనంతపురం



రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు

భారీ పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి తాడిపత్రి

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి మరిన్ని భారీ పరిశ్రమలు రాబోతున్నాయనిభారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి నివాసంలో జరిగిన ఓప్రయివేటు కార్యక్రమానికి శుక్రవారం హాజరైన మంత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కేవలం 9 నెలల్లో రాష్ట్రానికి రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇదివరకే ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిన కొన్ని ప్రాజెక్టుల సమస్యలు తొలగిపోయి వాటి పనులు ప్రారంభమయ్యాయనిఅన్నారు. కేవలం 9 నెలల్లో రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటే దీనికి చంద్రబాబు విజనే కారణం అని అన్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రతి భారీ పరిశ్రమకు ఒక ప్రత్యేక అధికారి నియమించి సమస్యలు రాకుండా చూడాలని చంద్రబాబు చెప్పారని మంత్రి ఈసందర్భంగా తెలిపారు. తమ ప్రభుత్వంలో ఖచ్చితంగా 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతామన్నారు. తాడిపత్రిలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఎందుకు మూతపడ్డాయో విచారించి, ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి టీజీ. భరత్

'ఉపాధి' సగమే

- సగటున 49.65 రోజులే పని
- వంద రోజులు పని పూర్తి చేసింది 17,264 కుటుంబాలే
- పది వారాలుగా పెండింగ్‌లో బిల్లులు
- నేటి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉపాధి హామీ పథకం కింద వంద రోజులు పని కల్పించాలని లక్ష్యమున్నప్పటికీ ఇప్పటి వరకు కల్పించినది కేవలం యాభై రోజుల్లోపే ఉండటం గమనార్హం. మరోవైపు పనిచేసిన కూలీలకు పది వారాలైనా బిల్లులు పడకుండా ఉన్నాయి. వ్యవసాయ పనుల్లేని కాలంలో గ్రామాల్లో ఈ పనుల ద్వారా ఉపాధి లభిస్తుందని భావించిన వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయింది. దీంతో వలసలే శరణ్యమవుతున్నాయి. ఇప్పటికే రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు ప్రాంతాల నుంచి అనేక మంది ఉపాధి కోసం వలసలు వెళ్లారు.

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం
ఆంధ్రప్రదేశ్

యాభై రోజులే పని

జిల్లాలో 3.13 లక్షల జాబ్‌కార్డులున్నాయి. 5.79 లక్షల మంది కూలీలు నమోదయి ఉన్నారు. 4.64 లక్షల మంది వ్యవసాయ కూలీలు పనికొచ్చేవారున్నాయి. ఇంత సంఖ్యలో పనికొచ్చేవారున్నా పని కల్పించడం లేదన్న విమర్శలున్నాయి. దీని మూలంగా ఈ ఏడాది అంటే 2024-25 ఆర్థిక సంవత్సరం ఇక రెండు వారాల్లో ముగియనుంది. ఇంత వరకు చూస్తే సగటున 49.65 రోజులే పని కల్పించారు. అంటే వంద రోజులు పని కల్పించాలన్నది లక్ష్యమైతే సగటున పని కల్పించినది 49.65 రోజులు మాత్రమే. ఇక వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు చూస్తే కేవలం 17264 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఐదు శాతంలోపే వంద రోజులు పని పూర్తి చేసుకున్న వారు ఉన్నారు.

పది వారాలైనా అందని బిల్లులు

ఇక పనిచేసిన దానికి బిల్లులు రావడంలోనూ తీరని జాప్యం నెలకొంది. చాలా చోట్ల ఎనిమిది నుంచి పది వారాలైనా బిల్లులు రావడం లేదు. ఈ రకంగా బిల్లులు పెండింగు ఉన్న వరకు చూస్తే పెద్దపప్పూరు, వజ్రకరూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఎనిమిది నుంచి పది వారాలైన బిల్లులు అందక కూలి డబ్బుల కోసం ఎదురు చూసే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇక పనిచేసే ప్రాంతాల్లో నీడ, నీళ్ల వంటివి కూడా లేవు. ఎండ వేడిమి పెరుగుతున్న తరుణంలో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాకుండా గునపం పదును చేసుకోవడానికి గతంలో బిల్లులు ఇచ్చేవారు. ఈసారి అవి కూడా అందటం లేదని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు.

నేటి నుంచి స్కూటర్ ర్యాలీ :

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

వ్యవసాయ కూలీల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి స్కూటర్ ర్యాలీలను నిర్వహించనున్నట్టు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. ఆయా మండలాల వారీగా ఇది జరుగుతుందన్నారు. ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు ఈ ర్యాలీలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం ఈనెల 22వ తేదీ వరకు సచివాలయాల్లో సమస్యలపై వినతిపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. అక్కడికి ప్రభుత్వంలో స్పందనలేకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని తలపెట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కూలీలకు పనులు కల్పించాలని, పెండింగు బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పని ప్రాంతాల్లో నీడ, నీరు సౌకర్యంతో పాటు వేసవి అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

20, 21 తేదీల్లో సచివాలయాల వద్ద ఆందోళన

శింగనమల : ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల వ్యాప్తంగా ఈనెల 20, 21వతేదీల్లో సచివాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 15 నుంచి 19వ తేదీ వరకూ స్కూటర్ యాత్రగా కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోనున్నట్లు తెలిపారు. కూలీలు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 20, 21న సచివాలయాల వద్ద ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. రోజుకు రెండు గ్రామాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పన్నులు చెల్లించండి : కమిషనర్

అనంతపురం కార్పొరేషన్ : 2024-2025 ఆర్థిక సంవత్సరానికి మరో 17రోజులే ఉన్నందున బకాయిదారులు ఆఖరి వరకూ వేచి ఉండకుండా త్వరగా పనులు చెల్లించాలని కమిషనర్ బాలస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. నెలాఖరు నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో బకాయిదారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ముఖ్యంగా నీటి కొళాయి పన్ను చెల్లించకపోతే కనెక్షన్ తొలగించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కావున నగర ప్రజలు ఈనెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు చెల్లించుకోవాలని కోరారు.

17న ఉద్యోగమేళా

అనంతపురం కలెక్టరేట్ : నగర సమీపంలోని ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఎకాలజీ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాటా స్ట్రయివ్, ఎంఎస్ఎన్ ఫార్మా సంస్థల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నివర్గాలకు సమన్యాయం

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాలకు సమన్యాయం జరుగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపి బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమానంగా నిధుల కేటాయింపులు చేయడమే సమన్యాయానికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా సూపర్-6 పథకంలో మిగిలిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు కూడా నిధులు కేటాయించారన్నారు. వీటితోపాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాకు చెందిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారన్నారు. మీ హయాంలో ఎన్ని నిధులు కేటాయించారు.. తమ హయాంలో ఎన్ని నిధులు కేటాయించారో తెలుసుకోవాలన్నారు. మీలాగా ప్రజలకు తప్పుడు మాటలు చెప్పి దగా చేయలేదన్నారు. ముఖ్యంగా రాయలసీమకు తీవ్ర ద్రోహం చేసింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డే అన్నారు. గతంలో మీరు వ్యవస్థలను నాశనం చేసింది నిజం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజలకు కావాలనే తప్పుదోవ పట్టించేందుకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను తాము అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పెంచిన పింఛన్లు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇక బిసి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించారన్నారు. మరోవైపు ఉద్యోగులకు కూడా త్వరలోనే న్యాయం చేస్తారన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ మోసపూరితం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ మోసపూరితంగా ఉందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు వాగ్దానం చేశాయని దీంతోపాటు ఎన్నికల ప్రణాళికలో కూడా ప్రకటించాయని అన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ఇరువురు జనవరి 29న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి ప్యాకేజీ ప్రకటించారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు కేవలం ఉన్న అప్పులు తీర్చడానికి మాత్రమే ఉపయోగించాలని, స్టీల్ ప్లాంట్ కార్మికుల వేతనాలకు గానీ, ముడిసరుకు కొనడానికి గానీ, ప్లాంట్ నడపటానికి కావాల్సిన పరికరాలు కొనడానికి ఉపయోగించరాదని ప్రకటించారన్నారు. దీన్ని బట్టి చూస్తే కేటాయించిన ప్యాకేజీ ద్వారా ఉన్న అప్పులు తీర్చి ప్రైవేట్ వారికి అప్పులు లేని ప్లాంట్‌ను ధారాదత్తం చేయాలనే కుట్ర ఉందని అర్థం అవుతోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మూడో బ్లాస్ ఫెర్నెష్ ఆగస్టు 2025 నుండి నడిపిస్తామని చెప్పడం అతిశయోక్తిగా ఉందన్నారు. ప్లాంట్ నడవాలంటే కనీసం కార్మికులకు చట్టబద్ధంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఉత్పత్తికి కావాల్సిన ముడిసరుకును కొనకుండా ప్లాంట్ నడుస్తుందా అని ప్రశ్నించారు. మోసపూరితంగా ప్యాకేజీ ప్రకటించి రాష్ట్ర ప్రజలను, కార్మికులను మభ్య పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే కేంద్ర ప్రభుత్వం ఈ తప్పుడు నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని ముడి ఇనుప ఖనిజాన్ని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించే బాధ్యత ముఖ్యమంత్రిదేనని అన్నారు. ప్లాంట్ నడపడానికి అవసరమైన నిధులు కేంద్రం నుండి తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా, ప్లాంట్‌కు గనులు కేటాయించాలన్న డిమాండ్‌తో ప్రజలు, ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలన్నీ ఉద్యమం చేయాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రధాన సమస్య సొంత గనులు లేకపోవడమేనన్నారు. నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి చేస్తున్న ప్లాంట్ కు సొంత గనులు ఎందుకివ్వరని ప్రశ్నించారు. సొంత గనులు ఉన్న ప్లాంటుకు టన్ను రూ. వెయ్యిలోపు ముడి ఇనుప ఖనిజం దొరుకుతుందనికానీ విశాఖ స్టీల్ ప్లాంట్ మార్కెట్లో ఒక టన్ను రూ. 6 వేల నుండి రూ. 8 వేల వరకు కొనాల్సివస్తోందని అన్నారు. ఈ భారం ప్లాంట్‌ను కుంగదీస్తుందన్నారు. దీనికి కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. ప్లాంట్ నిర్మాణమే జరగని కార్పొరేట్ కంపెనీ అయిన ఆర్సిలార్ మిట్టల్‌కు గనులు ఇవ్వాలని కోరడం రాష్ట్ర ప్రజలను వంచించడమేనని విమర్శించారు. 32 మంది పోరాట వీరుల ప్రాణ త్యాగంతో ఏర్పడిన స్టీల్ ప్లాంట్ కాపాడుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా కార్మికులు, ప్రజల పోరాటం వల్లనే విశాఖ స్టీల్ ప్లాంట్ నేటికీ ఒక్క శాతం కూడా ప్రైవేట్ కాకుండా ఉందన్నారు. అదే స్ఫూర్తి ప్రదర్శిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విభజన హామీల ప్రకారం కడపలో ప్రభుత్వ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, తిరుమలేష్, లక్ష్మీ నరసమ్మ, పెద్దక్క, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, పెన్నా, నల్లప్ప, ఆటో యూనియన్ నాయకులు ఆదినారాయణ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

'అనంత'ను నెంబర్ వన్‌గా చేస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అభివృద్ధిలో అనంతపురాన్ని రాష్ట్రంలోనే నెంబర్-1గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో ఏడుగురికి మంజూరైన రూ.9.50లక్షల చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారో పట్టించుకోనని, తన మొదటి అజెండా అనంతపురం అభివృద్ధే అన్నారు. ప్రస్తుతం విమర్శలు చేసే వారు 40 ఏళ్ల నుంచి చేయలేని పనులు తాను చేసి చూపిస్తానన్నారు. అసెంబ్లీలో తనకు రెండుసార్లు మాట్లాడే అవకాశం రావడంతో నగరంలో ప్రధాన సమస్యలుగా ఉన్న డంపింగ్ యార్డు, ప్రొడక్షన్ వాల్స్, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వంటి సమస్యలపై మాట్లాడానని గుర్తు చేశారు. అక్టోబర్ రెండులోపు డంపింగ్ యార్డును క్లియర్ చేసి చూపిస్తామన్నారు. రూ.88కోట్లతో మరువవంక, నడిమివంక ప్రొటెక్షన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు కూడా త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. గత 15ఏళ్లలో జరగని అభివృద్ధిని ఏడు నెలల్లోనే చేసి చూపిస్తున్నామన్నారు. వీటితోపాటు అనేక పనులు చేశామన్నారు. నగరంలో మున్సిపల్ స్థలాలు, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్‌అహ్మద్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సైఫుద్దీన్, క్లస్టర్ ఇన్‌ఛార్జి గోపాల్‌గౌడ్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్, మాజీ కార్పొరేటర్ మల్లెల దుర్గేష్, టీడిపి నాయకులు డాక్టర్ హరి, మహిళా నాయకురాలు శ్రీదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

హోలీ సంబరాలు



అనంతపురం రూరల్ : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శుక్రవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో హోలీ సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా మనవడు, మనవరాలితో కలిసి రంగులు చల్లుకున్నారు. అనంతరం రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరానగర్‌కు రోడ్డు వేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఇందిరానగర్‌కు రోడ్డు వేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా 49వ డివిజన్ ఇందిరానగర్‌కు రోడ్డు వేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరానగర్‌కు 1999లో సీసీ రోడ్డు వేశారన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు గుంతలమయమైందన్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు వేయాలని సిపిఎం ఆధ్వర్యంలో అనేమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నీలిమా టాకీస్ నుంచి హెచ్‌ఎల్‌సి కెనాల్ వరకూ రోడ్డు వేయాలని టెండర్లు పిలిచి సగం రోడ్డును వేశారన్నారు. ఆర్‌కె నగర్ ఆటో స్టాండ్ నుంచి హెచ్‌ఎల్‌సి కెనాల్ వరకూ రోడ్డు పాడైపోయి ప్రజలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ రోడ్డులో చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్లల్లోకి నీరు వస్తోందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి రోడ్డు వేయాలని ప్రజలతో సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాల వినతిపత్రాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తామన్నారు. అయినప్పటికీ స్పందించకపోతే స్థానికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, నగర కమిటీ సభ్యులు ప్రసాద్, ఇందిరానగర్ కాలనీవాసులు చెన్నకేశవులు, కుమార్, హరికృష్ణ, షరీఫ్, నాగరాజు, వెంకటేష్, నాగేంద్ర, సురేష్, వలి, చాంద్, బాషా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతి అవుతున్న అడవులు

పట్టించుకోని అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వేసవి కాలంలో అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు అకాతాయిలు అడవులకు నిప్పు పెట్టుటుండటంతో అటవీసంపద ఆహుతి అవుతోంది. అవగాహన కల్పించాల్సిన అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు అడవులకు చిన్నచిన్న గుట్టలకు నిప్పు పెట్టడం వల్ల దగ్గర్లో ఉన్న పంటలు, గడ్డివాములు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. మండల పరిధిలోని బందారుచెట్లపల్లి వద్ద బుధవారం గుర్తు తెలియని గుట్టలకు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తమ పంటకు మంటలు వ్యాపిస్తాయన్న ఆందోళనతో మంటలు ఆర్పడానికి నానాపాట్లు పడుతున్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలోనే మర్రికోమదిన్నె గ్రామ సమీపంలో గుట్టకు గుర్తుతెలియని అగంతకులు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసి పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నంబులపూలకుంట మండలంలో అడవిలో చెలరేగిన మంటలు

నేడు డాక్టర్ సాయి కాళేశ్వర్ వర్ధంతి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పేదల అభ్యున్నతే ధ్యేయంగా డాక్టర్ సాయి కాళేశ్వర్ షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్‌ను స్థాపించి, తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన 13వ వర్ధంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించను న్నారు. స్థానిక శివసాయి మందిరం వద్ద ఉన్న కాళేశ్వర్ సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. సమాధి వద్ద ముందుగా కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రిని నెలకొల్పి ప్రతిరోజూ పేదలకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయిస్తున్నారు. వర్ధంతి సందర్భంగా ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప సూచించారు.


నూతన కమిటీ సభ్యులతో ఎస్ఎఫ్ఐ నాయకులు

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పోరాటాలుచేయడం ద్వారానే విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎస్విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా నవదీప్, ధనుష్, పట్టణ ఉపాధ్యక్షులుగా శీను, విజయ్, సహాయ కార్యదర్శులుగా రేవంత్, విజయ్‌కుమార్, కమిటీ సభ్యులుగా చంటి, వసంత్, మోహన్, దర్శన్, ఆనంద్, నరసింహ, నాగేంద్రను ఎన్నుకున్నారు.

అరటి రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్. రాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా అరటి రైతుల సమస్యలు పరిష్కరించడంతోపాటు దళారుల నుంచి కాపాడాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అరటి పంట సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేస్తే ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారన్నారు. అరటి పంటను కొనుగోలు చేసే కంపెనీలతో దళారులు కుమ్మక్కు కావడంతోనే ధరలు అమాంతం తగ్గాయన్నారు. 15 రోజుల క్రితం టన్ను అరటి ధర రూ.27వేలు ఉండగా ఒక్కసారిగా రూ.14, 15 వేలకు పడిపోవడం బాధాకరమన్నారు. కేవలం దళారుల కుట్రే అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే దళారీ వ్యవస్థపై చర్యలు తీసుకుని అరటి రైతులను అదుకోవాలని డిమాండ్ చేశారు.

'ఎస్వి'లో ఘనంగా 'పై' డే

ప్రజాశక్తి-అనంతపురం


విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న అతిథులు

నగరంలోని ఎస్వీ డిగ్రీ, పిజి కళాశాలలో మాథెమాటిక్స్ విభాగం ఆధ్వరంలో శుక్రవారం పై డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ పై యొక్క స్థిరమైన విలువను మొదట సిరక్యూస్‌కు చెందిన గణిత శాస్త్రవేత్త ఆర్కిమెడిస్ లెక్కించారన్నారు. 1737లో లియోన్‌హార్డ్ ఆయిలర్ పై చిహ్నాన్ని ఉపయోగించడం వల్ల ఇది శాస్త్రీయ సమాజంలో ఆమోదించినట్లు వివరించారు. ఇందులో భాగంగానే ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పైడేని జరుపుకుంటారని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి ప్రసాద్, మాథెమాటిక్స్ విభాగానికి చెందిన కన్వీనర్ సి.రవికుమార్, అధ్యాపకులు ఎం.నరేష్‌కుమార్, ఎం.శివతేజ, ఎస్.నజ్మాబేగం, జి.గురుప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ సాగర్, పోలీసులు

నార్పల : తప్పిపోయిన మండల కేంద్రంలోని చైతన్య కాలనీకి చెందిన బాలుడు పప్పూరు మహిధర్‌ను పోలీసులు శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. చైతన్య కాలనీకి చెందిన మహిధర్ 7వ తరగతి చదువుతున్నాడు. ఈనేపథ్యంలో తల్లిదండ్రులు మందలించడంతో గురువారం ఇంటి నుంచి పారిపోయాడు. నార్పలంతా గాలించడంతోపాటు బంధువులను విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం రాత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకూ పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని ఎస్ఐ సాగర్ సమక్షంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు.

వైసిపి కార్యకర్త మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

నార్పల : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి వీధికి చెందిన వైసిపి కార్యకర్త ఎర్రగడ్డ ఈశ్వరయ్య (52) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు ఈశ్వరయ్య స్వగృహానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని నాగులగుడ్డం తండా పంచాయతీలో అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించారు. నాగులగుడ్డం తండాలో గత మూడేళ్లుగా ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులతో చర్చించి కొత్త బోరు వేయాలని ఆదేశించారు. దీంతో ఎంపిడిఒ భాస్కర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గ్రామంలో నూతన బోరు వేశారు. సంమృద్ధిగా నీరు పడటంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. దీంతో ఎమ్మెల్యే శ్రావణిశ్రీతోపాటు ఎంపిడిఒ భాస్కర్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ముగిసిన ఉరుసు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామంలో చెరువు కట్టపై వెలిసిన హజరత్ యాదుల్లాహ్ భాషా ఖాదిరి రహంతుల్లా అలైహి ఉరుసు శుక్రవారం ముగిసింది. మాజీ సర్పంచి ఎస్.మహబూబ్ సాబ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్.ఇసాక్ సాహెబ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉరుసును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాందిని, షంషీర్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఇఫ్తార్ విందు

బొమ్మనహాల్ : రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు నూరా నీ మజీద్ ముత్తు వల్లి నూర్ మొహమ్మద్ తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాసం ఉండేవారికి ఇఫ్తార్ ఇస్తే శుభం కలుగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే..

పెద్దపప్పూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే అని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్, ఆర్డీటీ కాలనీలో ఉన్న ఎంఆర్‌పిఎస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం ఎస్సీ కులాల వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ జస్టిస్ రాజు రంజన్ మిశ్రా కమిషన్ ఇటీవల ప్రభుత్వానికి నివేదిక సమర్పించారన్నారు. నివేదికను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రుల కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం శుభ పరిణామం అన్నారు. త్వరలోనే వర్గీకరణ జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, వై.గంగన్న, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం.చంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హోలీ శుభాకాంక్షలు

పుట్లూరు : హోలీ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మత సామరస్యం పాటిస్తూ ఎంతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ శివారులో కొండపై వెలిసిన చెన్నకేశవస్వామి కళ్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున నుంచే అర్చకులు మహాగణపతి పూజ, సుదర్శన హోమం, విశేష అలంకరణ చేశారు. శ్రీదేవి, భూదేవి స్వామి కళ్యాణాన్ని సర్పంచి అప్పా వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి వచ్చి పూజలు నిర్వహించారు.

త్వరలో రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి-రాయదుర్గం

అసమ్మతివర్గ నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి అసమ్మతివర్గ నాయకులు

త్వరలో రాయదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు వైసిపి అసమ్మతి నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వలిబాషా, శ్రీనివాస్‌యాదవ్, వైసిపి మాజీ జిల్లా అధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, డి.హీరేహాల్ మండల మాజీ కన్వీనర్ వన్నూరుస్వామి మాట్లాడుతూ వైసిపి నుంచి ఆరుగురు వైస్ ఛైర్మన్లను సస్పెండ్ చేసినట్లు ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా ఉన్న ఓ దినపత్రికలో వచ్చిన వార్తను చూసి ఆశ్చర్యపోయామన్నారు. తమను సస్పెండ్ చేసినట్లు అధిష్టానం నుంచి ఎలాంటి నోటీసూ అందలేదన్నారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తూ ప్రజల్లో పార్టీ బలాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయన కన్వీనర్‌గా ఉంటే తాము పార్టీలో కొనసాగలేమన్నారు. ఇద్దరు వైస్ ఛైర్మన్లతో కలిపి 12 మందితోపాటు 8 మంది వార్డు సభ్యులు వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయం అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డికి పంపుతున్నట్లు తెలిపారు. కాగా రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాలు శిల్ప పురపాలక సంఘంలో కుటుంబ పాలన నడుపుతున్నారన్నారు. అంతేగాక అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. త్వరలో ఆమెపై అవిశ్వాసం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. కాగా డి.హిరేహాల్ మండలంలో 9 మంది, బొమ్మనహాల్ మండలంలో ముగ్గురు సర్పంచులు వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు బాధ్యత అధ్యాపకులదే..

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య


శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెఎన్‌టి రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య

సాంకేతిక విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందిచాల్సిన బాధ్యత అధ్యాపకులదే అని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య సూచించారు. స్థానిక జెఎన్‌టియులోని ఎలక్ట్రికల్ సెమినార్ హాల్‌లో కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ విబి చిత్ర అధ్యక్షతన ఐదు రోజులపాటు నిర్వహించిన ట్రైన్ ది ట్రైనర్ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జాతీయి స్థాయి వరకూ సమస్యలను స్థానికంగా, సృజనాత్మకంగా, స్వయంశక్తితో పరిష్కరించుకుంటూ ఆయా ప్రాజెక్టులను వ్యాపారాలుగా కంపెనీలుగా మార్చుకోవాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న విషయాలు విద్యార్థులకు వివరించాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఎవరైనా మంచి ప్రాజెక్టులతో ముందుకొచ్చే వారికి అన్నివిధాలుగా సహయం చేసేందుకు 'ఇంకు బేశన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇలాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని ప్రోత్సహించడంలో వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు ముందుంటారన్నారు. అనంతరం శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అకడమిక్, ప్లానింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, ఆచార్య టి.నారాయణరెడ్డి, సాంబయ్య, శ్యామ్ రాజేష్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకా

ప్రజాశక్తి-శింగనమల


శింగనమల మండల గుమ్మేపల్లిలో వ్యాధి టీకాలు వేస్తున్న వైద్యులు

మండల పరిధిలోని గుమ్మేపల్లి గ్రామంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వై.రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఇందులో భాగంగా పంచాయతీలో దాదాపు 170 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచు డేగల లలితమ్మ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, కల్లుమడి పశు వైద్యాధికారి డాక్టర్ మల్లిక ఆంజనేయులు, గోపాలమిత్ర శేఖర్, నాయకులు బాల్‌రెడ్డి, డేగల కిరణ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.


బెళుగుప్ప మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న వైద్యులు

బెలుగుప్ప : రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని ఉరవకొండ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు జి.వెంకటేష్ కోరారు. జాతీయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక వీరాంజనేయ కొట్టాల గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని ఉప సంచాలకులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఉదయమే టీకాలు వేసుకోవాలన్నారు. అలాగే ప్రతి పశువుకూ గుర్తింపు సంఖ్యను కలిగిన చెవిపోగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు ఎర్రిస్వామి, బంధుక రవితేజ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా నీటి సరఫరాలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సంగం శ్రీనివాసులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌తో కలిసి నీటి సరఫరా విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ చాలామంది సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతోపాటు కొంతమంది డబ్బులు ఇస్తే ఇచ్చిన వారి ప్రాంతానికి ఎక్కువ సమయం నీటిని వదులుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఈ రెండింటి పైన విచారణ చేస్తున్నామని, నిజమని తేలిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో ఎక్కడా నీటి ఎత్తడి తలెత్తకుండా అవసరమైన చర్యలను ముందస్తుగానే తీసుకోవాలన్నారు. నీటి సరఫరా విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై వేటు తప్పదన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వాటర్ మెన్ నుంచి కమిషనర్ స్థాయి వరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. పైప్ లైన్ లు ఎక్కడ లీకేజీ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రాంతాల వాటర్ మెన్‌లపై ఉందన్నారు. లీకేజీలు అయినా వెంటనే సంబంధిత ఫిట్టర్, అమ్యూనిటీ సెక్రటరీల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే అంచనాలను సిద్ధం చేయించి, మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. పట్టణంలో ఎవరి వార్డులో నీటి సమస్య వస్తుందో ఆ వార్డులో పని చేసే సిబ్బంది పైన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్లక్ష్యం వీడి విధులు నిర్వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ శోభన్ రెడ్డి, ఏఈ శంకర్, టెక్నికల్ అధికారి బండి ఆనంద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బంధువుల చెంతకు మతిస్థిమితం లేని మహిళ

ప్రజాశక్తి-హిందూపురం

ఓ మతిస్థిమితం లేని మహిళ ను హిందూపురం పోలీసులు కాపాడి బంధువుల ఆచూకీ గుర్తించి వారి చెంతకు చేర్చారు. ఇందుకోసం సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీసులను శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న అభినందించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పూజిత మతి స్థిమితం లేక ఇంటి నుండి వచ్చి భువనేశ్వర్ ట్రైన్ ఎక్కి బెంగళూరు వైపు వచ్చింది. అయితే ట్రైన్‌లో కంపార్ట్ మెంట్ పక్కనే ఉన్న బెంగళూరుకు చెందిన వారి సెల్ ఫోన్ తీసుకున్న మహిళ వారి బంధువులతో ఫోన్ లో మాట్లాడింది. అనంతరం ఆ మహిళ భర్త తిరిగి అదే నంబరుకు ఫోన్ చేయగా పూజిత హిందూపూర్ రైల్వే స్టేషన్ లో దిగి వెళ్లిపోయిందని వారు తెలిపారు. దీంతో వెంటనే పూజిత భర్త సుమన్ రాయ్ విషయాన్ని వెస్ట్ బెంగాల్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న ద్వారా సమాచారాన్ని చేరవేశారు. వెంటనే స్పందించిన జిల్లా పోలీసులు రంగంలోకి దిగాయి. డీఎస్పీ కె.వి మహేష్ నేతృత్వంలో టూ టౌన్ సిఐ కరీం, వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్ తన సిబ్బందితో మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హిందూపురం రైల్వే ట్రాక్ సమీపంలో ఓ మహిళ ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి పోలీసులు చేరుకొని మహిళను పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని భర్త సుమన్ రాయికి ఫోన్ ద్వారా తెలియజేశారు. అక్కడి నుండి వచ్చిన ఆయనకు పూజితను అప్పగించారు. జిల్లా ఎస్పీ వి. రత్న తీసుకున్న చొరవ హిందూపురం టూ టౌన్ సిఐ కరీం, ఎస్ఐ శ్రీధర్ ,పోలీస్ సిబ్బంది తమ భార్యని ప్రాణాలతో సురక్షితంగా అప్పజెప్పినందుకు పూజితన భర్త కృతజ్ఞతలు తెలిపారు. మతిస్థిమితం లేని మహిళను సురక్షితంగా కాపాడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పిన హిందూపురం పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

పక్కాగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర

పుట్టపర్తి అర్బన్ : ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం అధికారులందరూ సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం జిల్లా అంతట ఈ కార్యక్రమం చేపట్టాలని, ఆ వివరాలను ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని తాహశీల్దార్లకు సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని విక్రయాలను సైతం అరికట్టాలని అన్నారు. భూమిలో కుళ్లిపోయే వస్తువులు మాత్రమే వాడాలన్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, కాయగూరల మార్కెట్, మార్కెట్ యార్డులు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక కేంద్రాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు ప్రధాన కూడళ్ళలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

గరుడ వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి - కదిరి టౌన్


ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం నిత్యపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన బ్రహ్మగరుడ సేవకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. సాయంత్రం సమయంలో గరుడదండం ప్రతిష్ఠించి, శ్రీవారిని తిరువీధుల్లో ఊరేగించారు. కొక్కంటి పాల్లెగాళ్లు శనివారం నుంచి శ్రీవారి సేవలో భాగస్వాములై దివిటి మోస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కదిరి పౌర్ణమికి ఖాద్రీశుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు శనివారం శేష వాహనం పై శ్రీవారు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటికి సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం రూరల్ : అనంతపురం సమీపంలోని డంపింగ్ యార్డుపై అసెంబ్లీలో చర్చించినందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను శుక్రవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో రాజీవ్‌కాలనీ టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా గజమాల వేశారు. డంపింగ్ యార్డును తరలిస్తే రాజీవ్‌కాలనీ ప్రజల ఆరోగ్యం బాగుపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్నహోబిలంలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలంలో స్వయంభువుగా వెలసిన ఉద్భవ లక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీస్వామి సుప్రభాతసేవ, 108 లీటర్ల పాలాభిషేకం, శ్రీసూక్తం, అభిషేకం, తోమాలసేవ, తామరపూలతో అర్చన, వేద గోష్ఠితో పాటు వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి అలంకరణ, మహాహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వలసలు నివారించాలి

ఉరవకొండ : జిల్లాలో ఉపాధి హామీ చట్టం కింద కూలీలకు పనులు కల్పించి వలసలను నివారించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో 425 గ్రామ పంచాయతీల్లో వ్యవసాయ పనులు లేనందున దాదాపు 42వేల మంది కూలీలు రోజూ ఉపాధి పనులకు వెళ్తున్నారన్నారు. అయితే వారికి కూలి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కూలీలకు ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించి వలసలను నివారించాలని డిమాండ్ చేశారు.

తూనికలు, కొలతలపై శిక్షణకు సతీష్‌బాబు ఎంపిక



అనంతపురం : జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో తూనికల కొలతలపై నిర్వహించనున్న శిక్షణ తరగతులకు జిల్లా నుంచి వినియోగదారుల సేవాసంఘం జిల్లా అధ్యక్షులు బి.సతీష్‌బాబు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణకు దేశంలోని ప్రతి రాష్ట్రం నుంచి వినియోగదారుల సేవాసంఘాలకు చెందిన ముగ్గురు ప్రతినిధులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సతీష్‌బాబుకు అవకాశం కలిగింది.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఉరవకొండ : ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎ నియోజకవర్గ కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసినస విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పలు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు 2024-25 విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారితోపాటు జిల్లా విద్యాశాఖ అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కలుషిత నీరు తాగి గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని కదరంపల్లి గ్రామంలో యూరియా కలిపిన నీరు తాగి శుక్రవారం 8 గొర్రెలు, 2 మేకలు మృతి చెందాయి. పశువైద్యాధికారి సూర్య నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కదరంపల్లికి చెందిన గోవిందు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం కూడా మేపుకోసం గొర్రెలను పొలానికి తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో ఓ పొలంలో యూరియా కలిపిన నీరు తాగడంతో పలు గొర్రెలు అపస్మారక స్థితికి చేరుకున్నాయి. వెంటనే సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్నట్లు పశువైద్యాధికారి తెలిపారు. అయితే అప్పటికే 8 గొర్రెలు, రెండు మేకలు మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే మిగిలిన వాటికి చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. జీవాలు మృతితో రామన్నకు సుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందన్నారు. జీవాలకు వైద్యం చేసిన వారిలో ఎహెచ్ఎలు మేఘన, రాఘవేంద్ర, దయానంద, తదితరులు ఉన్నారు.

టపాసుల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

నల్లచెరువు : స్థానిక దామోదర్ గ్రౌండ్ నెట్ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులు గోడౌన్ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దాదాపు 5 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలుస్తోంది. ఈ గోడౌన్ పక్కనే నిల్వ ఉంచిన ఎనిమిది టన్నుల కర్బూజా ఈ ప్రమాదంలో కాలిపోయింది. దీంతో తనకు రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని చెరువు వాండ్లపల్లికి చెందిన చెందిన రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను ప్రతిరోజు బండి పైన కాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నానన్నారు. శుక్రవారం తమిళనాడు నుంచి ఎనిమిదిన్నర టన్నుల కర్బూజా రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసి గోడౌన్‌లో నిల్వ ఉంచానన్నారు. టపాసుల గోడౌనపక్కనే కర్బూజా కాయలు ఉండడంతో ప్రమాదంలో మొత్తం కాయలు కాలిపోయాయన్నారు. సంబంధిత అధికారులు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని కర్బూజా వ్యాపారి రామాంజనేయులు కోరుతున్నాడు.

అరటిచెట్లకు నిప్పు

అగళి : మండలంలోని పి బ్యాడిగెరాలో ఓ రైతుకు సాగు చేసిన అరటి, వక్క, టెంకాయ చెట్లకు నిప్పు అంటుకుంది. గ్రామానికి చెందిన బడగొడ్డి మల్లప్ప తన పొలంలోని బోరుబావి వేసుకొని అరటి, వక్క, టెంకాయచెట్లను సాగు చేస్తున్నాడు. 550 వక్క చెట్లు, 75 టెంకాయ చెట్లు, 200 అరటి మొక్కలు వేసుకున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రైతు పొలానికి సమీపంలో ఉన్న బీడుభూమిలో ఉన్న గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. ఈ మంటలు మల్లప్ప పొలానికి వ్యాపించాయి. పొలంలో ఉన్న 200 వక్క చెట్లు, 35 టెంకాయ చెట్లు, 55 అరటి మొక్కలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న బాధిత రైతుల పొలానికి వచ్చి జరిగిన నష్టాన్ని చూసి భోరున విలపించాడు. మంటల్లో కాలి బూడిద అయిపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతుతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం : హిందూపురం- మలగూరు రైల్వే స్టేషన్ మధ్యలో రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న కీ మ్యాన్ శ్రీను నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రి స్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద లభించిన సెల్ ఫోన్, లగేజ్ బ్యాగ్, ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మొరాదాబాద్, మొహల్లా చౌక్, బజార్ ఖాన్ కు చెందిన నిస్సార్ కుమారుడు ఇస్రార్ (35) గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. విషయాన్ని బంధువులకు సమాచారం అందించామన్నారు. మృతుడు పట్టణంలోని టీచర్స్ కాలనీలో సుధాకర్ నాయుడు నిర్వహిస్తున్న బ్యూటీ పార్లర్ లో పనిచేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.